# అభిప్రాయ సేకరణతో ప్రభుత్వం కాలయాపన

- రైతు సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు

అలంపూర్, జూన్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో చెల్లింపులో ఆర్థికభారం తగ్గించుకోవడానికే ప్రయత్నం చేస్తుందని, అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఈదన్న ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహాజన సభ రైతు భరోసా అభిప్రాయ సేకరణ సమావేశంలో పాల్గొని అభిప్రాయాన్ని వెల్లడించారు. పరిమితులతో సంబంధం లేకుండా సాగులో ఉన్న ప్రతి గుంటకూ ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించాలన్నారు. పంటలు సాగు చేసుకుంటున్నప్పటికీ నేటికి రైతు భరోసా సాయం అందడంలేదని ఆరోపించారు. సాగు సమయంలో చేతిలో డబ్బులు లేక చాలామంది రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగుచేస్తున్న భూమి మొత్తానికి రైతు భరోసా ను అమలు చేయాలన్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో వ్యవసాయంపై యువ రైతులు మక్కువ పెంచుకునే అవకాశం ఉందన్నారు. రైతుభరోసాతో పాటు ప్రకృతి వైపరీత్యాలకు రైతులు నష్టపోకుండా పంటల బీమా పథకం కూడా అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు ఆదుకోవడంతోపాటు వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించాలన్నారు. సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, డీఏవో గోవింద్ నాయక్, కోఆపరేటివ్ డీఎస్పార్ మన్నెశ్వరీ, ఏవో అనిత, సీఈవో కేశవరెడ్డి, రైతులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని క్యాతూరు పీఏసీసీఎస్‌లో కూడా రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు.

### రైతుభరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ

గట్టు, జూన్ 30 : రైతుభరోసా పథకం అమలు కోసం రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మహాజన సభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఐదెకరాలకు బదులుగా పదెకరాల వరకు సాగుచేస్తున్న రైతులకు రైతు భరోసాను అందిస్తే బాగుంటుందని చెప్పారు. అనంతరం డీసీవో ప్రసాదరావు మాట్లాడుతూ మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకు ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని, వచ్చిన అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా మన్నారు. సమావేశంలో పీఏసీసీఎస్ చైర్మన్ వెంకటేశ్, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహేశ్, సీఈవో నర్సింహులు, సిబ్బంది వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీవో ప్రసాదరావు


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న

### నేడు ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 30 : ఎర్రవల్లి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పుటాన్‌దొడ్డిలో సోమవారం రైతుభరోసా పథకం అమలుకోసం రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు మహసభ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు పాల్గొని సలహాలు సూచనలు ఇచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహసభ ఉదయం 9గంటకు ప్రారంభమవుతుందని, సభకు జిల్లా సహకార అధికారి హాజరుకానున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ తెలిపారు.

## తుంగభద్ర డ్యాంకు వరద

- ఇన్‌ఫ్లో 6,730 క్యూసెక్కులు
- 5.790 టీఎంసీల నిల్వ


తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటినిల్వ

అయిజ, జూన్ 30 : కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతున్నది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు తుంగభద్ర డ్యాంకు వరద చేరుతున్నది. ఆదివారం డ్యాంలోకి 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 296 క్యూసెక్కులు నమోదైంది. తుంగభద్ర డ్యాం 105.855 గరిష్ట నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 5.790 టీఎంసీల నిల్వ ఉంది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికిగానూ ప్రస్తుతం 1582.48 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి సన్మానం


ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అమరచింత, జూన్ 30 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్సీగా గెలిచిన నవీన్‌కుమార్‌రెడ్డిని ఆదివారం మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో అమరచింత ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## బీచుపల్లి అంజన్న సన్నిధిలో ఎస్పీ


ఎస్పీని సన్మానిస్తున్న అర్చకులు

ఇటిక్యాల, జూన్ 30 : బీచుపల్లి అంజన్నను ఆదివారం ఎస్పీ తోటశ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో రామన్ గౌడ్ ఆలయ అర్చకులు ప్రహ్లాదాచారి, మారుతాచారి, సందీపాచారి ఎస్పీకి పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఈవో స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐ రవిబాబు, ఎస్సై వెంకటేశ్ ఉన్నారు.

## కంచె ధ్వంసం : కేసు నమోదు


ధ్వంసమైన ఇనుప కంచె

గోపాల్‌పేట, జూన్ 30 : పంట కాపాడుకునేందుకు పొలానికి ఏర్పాటు చేసిన ఇనుప కంచెను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం.. ఏదుల మండల కేంద్రానికి చెందిన ఎద్దుల శ్రీనివాస్‌రెడ్డి(రిటైర్డ్ ఆర్మీ) గ్రామ శివారులో ఉన్న తన పొలానికి 20రోజుల కిందట 77సిమెంట్ కడ్డీలతో కూడిన కంచెను ఏర్పాటు చేయించాడు. ఈనెల 28వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు కంచెను ధ్వంసం చేశారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నీటి తొట్లకు మరమ్మతులేవీ?


అమరవాయిలో మరమ్మతులకు నోచుకోని నీటితొట్టి

మల్దకల్, జూన్ 30 : మండలంలోని వివిధ గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం నిధుల ద్వారా నీటి తొట్లను నిర్మించారు. దీని వల్ల పశువులతో పాటు మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం నీటి తొట్లు పగిలి, నిర్వహణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధి కారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TEACHERS AVAILABLE
★KERALA TEACHER'S are available for immediate appointment. Schools can contact for teacher's. Cotact: 7012044141
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

### కుక్కల దాడిలో ఆరుమేకలు మృతి

- రూ.80వేల ఆస్తినష్టం


కుక్కల దాడిలో మృతిచెందిన మేకలు

కొత్తకోట, జూన్ 30 : పట్టణంలోని శిశుమందిర్ సమీపంలో కటిక ఖాజాకు చెందిన ఆరుమేకలపై ఆదివారం కుక్కలు దాడి చేయగా మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. కొంతకాలంలో పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నారులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. వీటి విలువ రూ.80వేల వరకు ఉంటుందని, ప్రభుత్వపరంగా తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరారు.

### పాన్‌గల్ ఎస్సైగా కల్యాణ్‌రావు



ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కల్యాణ్‌రావు

పాన్‌గల్, జూన్ 30 : మండల ఎస్సైగా కల్యాణ్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నాగర్‌కర్నూల్ ఎస్‌బీ ఎస్సైగా పనిచేసి బదిలీపై పాన్‌గల్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై వేణు సీసీఎస్ వనపర్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై కల్యాణ్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

### హైదరాబాద్‌లో వలస కూలి మృతి


ఆంజనేయులు (ఫైల్)

వడ్డేపల్లి, జూన్ 30 : పొట్ట కూటి కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలి పనులు చేస్తూ భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రామాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు (28) రెండునెలల కిందట హైదరాబాద్‌కు వెళ్లి భవన నిర్మాణ పనుల్లో కూలిగా చేరాడు. ఈక్రమంలో గురువారం రాత్రి భవనం నుంచి పడిపోగా శుక్రవారం గుర్తించారు. ప్రమాదంలో తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వడ్డేపల్లి, జూన్ 30 : రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం శాంతినగర్‌కు చెందిన ఆంజనేయులు, సుశీలమ్మకు రెండో కుమారుడు శాంసన్(23) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అయితే ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంసన్ మృతిచెందాడు. దీంతో ఇందిరానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### చికిత్స పొందుతూ ఉపాధికూలీ మృతి

పాన్‌గల్, జూన్ 30 : మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన ఉపాధిహామీ కూలీ తులసమ్మ(60) ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందారు. కొన్ని రోజుల కిందట తులసమ్మ తండాలో ఉపాధి పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, నాలుగు రోజులపాటు వైద్యం అందించారు. ఆదివారం కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకురాగా, మృతిచెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు,కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ కోరారు.

### నేడు సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ

కొత్తకోట, జూన్ 30 : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గుంత మౌనిక ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహావిష్కరణకు ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొత్తకోట, జూన్ 30 : మండలంలోని మిరాసిపల్లికి చెందిన వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో ప్రశాంత్, బీచుపల్లి, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొత్తకోట, జూన్ 30 : కొత్తకోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శేఖర్‌గౌడ్, ప్రసాద్, కృష్ణారెడ్డి, విశ్వమోహన్‌చారి, రాములుయాదవ్, వెంకటయ్య, నాగరాజు, జమున, పారిజాతం, చంద్రకళ, జ్యోతి, భవానీ, వసంత, మణిమాల పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


జేసీబీ సాయంతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

గద్వాల అర్బన్, జూన్ 30 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని సామాజిక సేవకుడు చంటి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతోపాటు శ్రమదానం చేశారు. జేసీబీల సాయంతో చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచిచల్లార్చిన నీటిని తాగడం, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. సేవా కార్యక్రమాలను చేపట్టడంపై కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడ్ పరీక్షలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లు అందజేస్తున్న పరిమళాదేవి

గోపాల్‌పేట, జూన్ 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం కరాటే మాస్టర్ రాగిణి సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 36 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, ఎల్లో బెల్ట్ విభాగంలో వినయ్, శ్రీకాంత్, దేవాన్స్, నిఖిల్, వరుణ్, ధనుష్, చరణ్, వినయ్‌కుమార్, లక్ష్మీప్రసాద్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో విగ్నేశ్, సతీశ్, సిద్దార్థ్, శివ, సిద్ధు గ్రీన్ విభాగంలో కార్తీక్, పర్పుల్ విభాగంలో జయకృష్ణ, తేజస్, బ్రౌన్ విభాగంలో శ్రీతన్ రితీశ్, కార్తికేయ ప్రతిభ కనబర్చారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ పరిమళాదేవి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు నిఖిల్ యాదవ్, రాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టవా..?


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అలంపూర్, జూన్ 30 : ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టనట్లు వ్యవహరిస్తుందని సీపీఎం జిల్లా నాయకుడు గంటెపోగు రాజు విమర్శించారు. ఆదివారం అలంపూర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబాటు తనానికి గురవుతుందని, గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న కాలేజీ వసతి గృహాలను మరో మండలానికి తరలించడం సబబు కాదన్నారు. ప్రభుత్వ భవనాలు ఉన్న అలంపూర్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయకుండా మరో మున్సిపాలిటీలో అద్దె భవనాల్లో ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. అలాగే వంద పడకల దవాఖానను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. భారత్‌మాల రోడ్డు భూబాధితులను మార్కెట్‌ధరలు ప్రకారం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహ నాగరాజు, ఆశన్న పాల్గొన్నారు.

### సాయిచంద్‌కు ఘన నివాళి


సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అమరచింత, జూన్ 30 : తెలంగాణ ధూందాం కళాకారుడు, ఉద్యమకారుడు సాయిచంద్ ప్రథమ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతోపాటు మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాజు, ప్రసాద్, సాయిచంద్ తండ్రి వెంకట్రాములు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

### ఆత్మకూరులో భారీ వర్షం


ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు, జూన్ 30 : ఆత్మకూరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి పొడి వాతావరణంతో ఉక్కపోతగా ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. నల్లటి మేఘాలు దట్టంగా అలుముకొని చల్లని గాలులు వీచాయి. క్షణాల్లో మొదలైన వర్షం అరగంట పాటు ధాటిగా కురిసింది. వర్షానికి వాతావరణం చల్లబడడంతో పట్టణవాసులకు ఉపశమనం లభించింది. వర్షానికి ప్రధాన రహదారులపై మురుగు పారింది. ఆదివారం సంత కావడంతో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లన్నీ జలమయం కావడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

### ఎస్‌బీఐ చైర్మన్‌కు మాజీ మంత్రి అభినందనలు

వనపర్తి, జూన్ 30 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసులుశెట్టిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు చెందిన వ్యక్తిని ప్రస్తుత ఎస్‌బీఐ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న చల్లా శ్రీనివాసులు శెట్టిని చైర్మన్‌గా ఆర్థికసేవల సంస్థ బ్యూరో సిఫారసు చేయడం శుభపరిణామమని కొనియాడారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్దపోతులపాడుకు చెందిన శ్రీనివాసులుశెట్టి ఎస్‌బీఐ చైర్మన్‌గా ఎంపికకావడంపై పలువురు అభినందించారు.

### చేనేత కార్మికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల, జూన్ 30 : రాష్ట్రప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరిట అందించే పురస్కారాలకు చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు గోవిందయ్య ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. పోచంపల్లి, ఇక్కత్, డ్రెస్, జనరల్ వెరైటీస్, నారాయణపేట, గద్వాల చీరల నేత పని రకాల్లో నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ పురస్కారాలకు అర్హులని చెప్పారు. వీవింగ్ కేటగిరీలో 2023 డిసెంబర్31 నాటికి 30సంవత్సరాల వయస్సు, వృత్తిలో పదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిజైనింగ్ కేటగిరీలో 25 సంవత్సరాల వయస్సు, వృత్తిలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తాము తయారు చేసిన పూర్తి వస్త్రాన్ని శాంపిల్‌గా గద్వాలలోని ఐడీవోసీలోని కార్యాలయంలో అందించాలన్నారు. జూలై 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 6న మెగా జాబ్‌మేళా

వనపర్తి, జూన్ 30 : నిరుద్యోగ యువత కోసం ఈ నెల 6న శనివారం పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటు పేరొందిన సంస్థల్లో వివిధ రకాల ఉద్యోగులను నియమించుకోనున్నట్లు వెల్లడించారు. పదో తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత గల నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 35ఏండ్ల వయసు గల వారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో 50సంస్థలు పాల్గొని 4వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా హైదరాబాద్‌లోని రాణీగంజ్ గుజరాతీ హైస్కూల్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ వివరాలను పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఇన్‌స్టా గ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తామని, వివరాల కోసం 9542433427 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

అమరచింత, జూన్ 30 : మానవ మనుగడకు జీవనధారమైన మొక్కలను ప్రతిఒక్కరూ నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో గల రామాచంద్రమిషన్ ఆవరణలో ఆర్ట్‌ఫుల్ సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పచ్చదనం, పరిశుభ్రతతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు సౌజన్యమ్మ, నాగభూషణంగౌడ్, పాండు, విష్ణు పాల్గొన్నారు.

### బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలి

పాన్‌గల్, జూన్ 30 : ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఏదుట్ల, రేమద్దుల, సింగాయిపల్లి, సింగోటం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సంగనమోని అన్వేశ్ కోరారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివారం మండలంలోని రేమద్దులలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతయ్య, సురేందర్‌రెడ్డి, రవీందర్, చక్రపాణి, చల్మారెడ్డి, బాషా పాల్గొన్నారు.


రేమద్దులలో నిరసన తెలుపుతున్న ఎల్లేని సుధాకర్‌రావు